# నాడు అధ్వానం.. నేడు అద్భుతం



నాడు గుంతలమయంగా ఉన్న హౌసింగ్‌బోర్డ్ ప్రధాన రోడ్డు



నేడు సుందరంగా డబుల్ రోడ్డు

- ఆంధ్ర పాలకుల హయాంలో రోడ్లను పట్టించుకోని పాలకులు
- ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మారిన రూపురేఖలు

ఆర్మూర్, నవంబర్4: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ఆంధ్ర పాలకుల హయాంలో పట్టణంలోని రోడ్లు అధ్వానంగా ఉండేవి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సర్కారు రోడ్ల అభివృద్ధిపై దృష్టిసారించింది. ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి రూ.కోట్లాది నిధులు మంజూరు చేయించి పట్టణంలోని రోడ్లను సుందరంగా తీర్చిదిద్దారు.

పట్టణంలోని హౌసింగ్‌బోర్డ్ కాలనీకి బస్టాండ్ వెనుక భాగం నుంచి ప్రీమియర్ బార్‌ను కలుపుతూ 2003 సంవత్సరంలో హౌసింగ్‌బోర్డ్ సంస్థ వారు బీటీ సింగిల్ రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ దారి వెంటే మూడు జూనియర్, రెండు డిగ్రీ కళాశాలలతోపాటు మూడు పాఠశాలలు ఉనానయి. దీంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. కొంతకాలానికి రోడ్డు గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షాలకు సైతం రోడ్డుపై నీరు నిలిచి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు చేడిపోయినా అప్పటి ఆంధ్రపాలకులు కనీసం మరమతులు చేయించలేదు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ రోడ్డు మరమ్మతుకు ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నిధులు మంజూరు చేయించారు. సింగిల్ రోడ్డును తొలగించి దాని స్థానంలో డబుల్ బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. రోడ్లు అద్దంలా మారడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


ముల్లంగి(బీ)లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

మాక్లూర్, నవంబర్4: మండలంలోని ముల్లంగి(బీ), అడవి మామిడిపల్లి గ్రామాల్లో శనివారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోలోని అంశాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్ సర్కారు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కారు గుర్తుకు ఓటేసి ఆర్మూర్ ఎమ్మెల్యేగా మరోసారి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పీఏసీఎస్ డైరెక్టర్ అశోక్, ఉప సర్పంచ్ సాయిలు, రవి, ప్రశాంతి, డీసీ గంగాదర్, జిబి గోవర్ధన్, రాజు, పుణ్యరాజ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాముల మాలధారణ


అయ్యప్ప స్వామి మాలవేసిన భక్తులు

ఆర్మూర్‌టౌన్, నవంబర్4: పట్టణంలోని జంబిహనుమాన్ అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తులు శనివారం అయ్యప్ప స్వామి మాల ధరించి దీక్ష ప్రారంభించారని గురుస్వామి నగేశ్‌శర్మ తెలిపారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామి మాల ధరించిన స్వాములు 41రోజులపాటు కఠినమైన దీక్షలో ఉంటారని పేర్కొన్నారు. ఉదయం, సాయంత్రం స్వాములు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

## విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన


విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పిస్తున్న సంస్థ సభ్యులు

ఆర్మూర్‌టౌన్, నవంబర్4: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్‌పై అవగాహన కల్పించారు. అగస్త్య ఫౌండేషన్ బృందం సభ్యులు కాంతి, విద్యుత్‌కు సంబంధించిన పలు కృత్యాలను విద్యార్థులతో చేయించారు. దానితోపాటు డిజిటల్ లిటరసీ పెంపొందేలా ఎంఎస్ ఆఫీస్‌పై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మీనర్సయ్య, సంస్థ సభ్యులు సుమలత, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మరో నామినేషన్ దాఖలు


ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేస్తున్న అభ్యర్థి ప్రణయ్‌గౌడ్

ఆర్మూర్‌టౌన్, నవంబర్4: పట్టణంలో అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా రెండో రోజు శనివారం ఇండిపెండెంట్ అభ్యర్థిగా ప్రణయ్‌గౌడ్ ఎన్నికల అధికారి వినోద్‌కుమార్‌కు నామినేషన్ పత్రాన్ని అందజేశారు. ప్రణయ్‌గౌడ్ డొంకేశ్వర్ మండల కేంద్రానికి చెందిన వారు. రెండో రోజు సైతం ఒకే నామినేషన్ వచ్చినట్లు ఎన్నికల అధికారి తెలిపారు.


నాయకులకు అభినందనలు తెలుపుతున్న జీవన్‌రెడ్డి

## సభ విజయవంతంపై అభినందనలు

ఆర్మూర్, నవంబర్4: ఎన్నిక ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆర్మూర్ పట్టణంలో నిర్వహించిన కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం కావడంతో శనివారం ఆర్మూర్ పట్టణ నాయకులు, వివిధ మండలాల నాయకులు శనివారం ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆర్మూర్ ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ ఆశన్నగారి జీవన్‌రెడ్డిని కలిసి సంతోషం వ్యక్తం చేశారు. సభ పెద్ద ఎత్తున్న విజయవంతం కావడంపై బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సభకు స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు, అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## లారీ, ద్విచక్రవాహనం ఢీ.. ఇద్దరి మృతి

- పింఛన్ కోసం వెళ్లి వస్తూ అనంత లోకాలకు
- మృతులు కంఠం గ్రామానికి చెందిన వారు


రేవెల్లి భూమన్న(ఫైల్)


గందం నాగమణి(ఫైల్)

మాక్లూర్, నవంబర్4: మండలంలోని చిక్లీ శివారులో శనివారం సాయంత్రం లారీ, ద్విచక్ర వాహనం(టీవీఎస్) ఢీకొని ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. వరుసకు మామ, కోడలైన నందిపేట్ మండలం కంఠం గ్రామానికి చెందిన రేవెల్లి భూమన్న(44), గందం నాగమణి (50) జన్నెపల్లిలోని పోస్టు ఆఫీసులో ఆసరా పింఛన్ తీసుకునేందుకు వెళ్లారు. తిరిగి నందిపేట్ వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నారు. గుంజిలి గ్రామం నుంచి జన్నెపల్లి వైపు వడ్ల లోడ్‌తో లారీ వెళ్తోంది. చిక్లీ గ్రామ శివారులో లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరూ లారీ ముందు చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. మాక్లూర్ ఎస్సై సుధీర్‌రావు సంఘటన స్థలానికి వెళ్లి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడు భూమన్నకు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు, నాగమణికి ముగ్గురు కుమారులు, భర్త ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## స్వేచ్ఛగా ఓటు వేయాలి

- కేంద్ర బలగాల కవాతు

ఆర్మూర్‌టౌన్, నవంబర్4: పట్టణంలో ఏసీపీ జగదీశ్ చందర్ ఆధ్వర్యంలో శనివారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. పట్టణంలోని గోల్ బంగ్లా నుంచి పెద్దబజర్ మీదుగా చిన్నబజర్ వరకు పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలు భయాందోళనకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో సూరేశ్‌బాబు, ఎస్సైలు అంజమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.


పట్టణంలోని గోల్‌బంగ్లా వద్ద పోలీసుల కవాతు